
# గౌతమ బుద్ధుడు



-బ్రహ్మర్షి పత్రీజీ

# గౌతమ బుద్ధుడు

"పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్" అన్నది - ఇది బుద్ధ సాంప్రదాయమా" అని చాలా మంది అడుగుతూంటారు!

'బుద్ధ సాంప్రదాయమంటే' వాళ్ళకి తెలిసినది, వాళ్ళ మనస్సులో ఉన్నది ఒక 'బుద్ధ సాంప్రదాయం'. అయితే నిజమైన 'బుద్ధ సాంప్రదాయం', వాస్తవానికి మరొకటి. కనుక, వారికి తెలిసిన బుద్ధ సాంప్రదాయమా ఇది?' అంటే, అది ఎంత మాత్రం కాదు. 'నిజమైన బుద్ధ సాంప్రదాయమా?' అంటే, అవును! ఖచ్చితంగా బుద్ధ సాంప్రదాయమే- Absolutely! So My dear friends, My dear Masters, My dear Gods...

...బుద్ధుని గురించి తెలియని వాళ్ళందరూ బుద్ధుని గురించి తెలిసినట్టు మాట్లాడుతున్నారు. ఈ రోజు మనం గౌతమ బుద్ధుని గురించి అందరికీ తెలియనిది కొంత, తెలిసింది కొంత రెండూ కలగలిపి చక్కగా తెలుసుకుందాం.

గౌతమ బుద్ధుడు ఈ భూమండలం మీద జన్మించిన ఉత్తమోత్తముల్లో ఉత్తముడు! పురుషోత్తముల్లో పురుషోత్తముడు! కనుక, ఎవరైనా కూడానూ తమ జీవితంలో పరిపక్వతను సాధించాలని అనుకుంటే వెంటనే ఇక వేరెవరూ కనబడరు - ఒక్క గౌతమబుద్ధుడే కనబడతాడు. మన జీవితాలను మనం గౌతమ బుద్ధుని యొక్క జ్ఞానంలో, అనుభవంలో, ఆ యొక్క దివ్య చరిత్రలో, ఆ యొక్క దివ్య జీవితంలో మలుచుకుంటే అత్యంత సత్వరమైన ప్రగతి పథంలో మనం ముందంజలో వుంటాం. నేనూ అదే చేసాను. చిన్నప్పటి నుంచీ గౌతమ బుద్ధుడంటే నాకు అపరిమితమైన ప్రేమ.

భారత దేశంలోకానీ, ప్రపంచం మొత్తంలో కానీ గౌతమ బుద్ధుడంటే, మరి జీసెస్ క్రైస్ట్ అంటే, తెలియని మనిషంటూ వుండడు. జీసెస్ క్రైస్ట్‌ను ప్రభావితం చేసిన మనిషి గౌతమబుద్ధుడు. జీసెస్‌క్రైస్ట్ బుద్ధుని శిష్యుల ద్వారా బుద్ధత్వ పూర్ణతను గ్రహించాడు. 'గౌతమ బుద్ధుడికి ముందున్న శకం; గౌతమ బుద్ధుడికి తర్వాత శకం' అని ఈ

భూమండలంలో రెండు వేరు వేరు శకాలుగా చెప్పవచ్చు.

ఎలాగైతే 'క్రీస్తుపూర్వం', 'క్రీస్తు తర్వాత' అంటామో, అలాగే 'బుద్ధుడికి పూర్వం', 'బుద్ధుడి తరువాత' అని చెప్పవచ్చు. కనుక, బుద్ధుని తరువాత భూమండలం వేరు - మౌలికంగా వేరు, బుద్ధునికి పూర్వం భూమండలం వేరు, కనుక అంతటి గొప్ప మహత్తరమైన 'బుద్ధప్రకాశం' గురించి మనం ఈ రోజు కొంత చెప్పకుందాం- కొంత తెలుసుకుందాం.

బుద్ధుడు పుట్టినప్పుడే, ఆయన జాతకం చూసి చెప్పారు, "మహాసామ్రాట్ అయినా అవుతాడు; లేకపోతే, మహాయోగీశ్వరుడైనా అవుతాడు" అని. ఆయన అప్పటికే రాజు, రాజకుమారుడు. మహాసామ్రాట్ కావాలంటే ఇంకా ఎన్నో రాజ్యాలను కొల్లగొట్టి మహాచక్రవర్తి కావాలన్న మాట.

మామూలుగా ప్రతి రాజుకీ ఉండే కోరికే అది. చిన్న రాజ్యం నుంచి పెద్దరాజ్యం. పెద్ద రాజ్యం నుంచి భూమండలం అంతటికీ తాను ఏకైక రాజు కావాలని చెప్పేసి. అలెగ్జాండర్ అందుకే గదా, అందరిని చంపి, నరికి "చక్రవర్తి అలెగ్జాండర్" అని పేరు తెచ్చుకున్నాడు. కనుక, "అలాంటి వాడైనా అవుతాడు; లేకపోతే మహాయోగీశ్వరుడైనా అవుతాడు" అని చెప్పారు. "నిజానికి యోగీశ్వరుడే అవుతాడు" అనే వాళ్ళు జాతకం చెప్పారు.

బుద్ధుడు పుట్టకముందే ఆయనను చూడటానికి అసిత మహర్షి ఆ వార్త తీసుకుని శుద్ధోధనుని దగ్గరికి వచ్చాడు-ఏడుస్తూ అన్నాడు. "నేను అతన్ని చూడలేనే, అతను జ్ఞాని కాకముందే నేను చనిపోతానే" అని ఏడిచాడన్న మాట. ఎందుకంటే, "అంతటి గొప్ప జ్ఞానీ, అంతటి గొప్ప యుగపురుషుడూ, పూర్ణపురుషుడూ భూమండలంలో మరొకడు మళ్ళీ పుట్టడు. అంతకు ముందు ఎప్పడూ పుట్టలేదు. అంతటి అత్యద్భుతమైన సంఘటన నేను చూడలేను" అని చెప్పేసి ఆ అసిత మహర్షి శుద్ధోధనుడి దగ్గర భోరుమని ఏడ్చాడు.

అసిత మహర్షి చెప్పినట్లుగానే గౌతమబుద్ధుడు ఎక్కడ పుట్టాలో అక్కడ పుట్టి, ఎక్కడ పెరగాలో అక్కడ పెరిగి, తన జీవితంలో ఏం సాధించాలో అది సాధించి, తను ఎలా అందరికి బోధించాలో అలా బోధించి, ఎలా చావాలో అలా చచ్చి, ఎలాంటి వరాల్ని ఈ భూమండలానికి తన ప్రసాదంగా ఇవ్వాలో, ఎలాంటి జ్ఞానాన్ని ఈ భూమండలానికి

శాశ్వతంగా ఇవ్వాలో అలా ఇచ్చి ఆయన తెరమరుగయ్యాడు!

బుద్ధుడిని అల్లారుముద్దుగా పూలలో పెంచారు తల్లిదండ్రులు! ఆయన సకల కళలలోనూ, సకల విద్యలలోనూ ఆరితేరి ముచ్చటగా వివాహం చేసుకుని.....అంతా బాగానే వుంది పైకి. కానీ, లోపల మటుకు ఏదో వెలితి; "ఏదో చేయటం కోసం తాను వచ్చాడు. ఏదో పొందటానికి వచ్చాడు. అది ఇంకా మొదలు కాలేదే! ఏమిటో సంగతి!" అని చెప్పేసి ఆయన ఎప్పుడూ గుంభనంగా తనలోతాను వుండేవాడు. ఎక్కువగా మాట్లాడేవాడు కాదు. ముక్తసరిగా మాట్లాడేవాడు. అయితే, పర్‌ఫెక్టుగా మాట్లాడేవాడు. కానీ ముక్తసరిగా మాట్లాడేవాడు. అందరితో చక్కగా వుండేవాడు. కానీ "ఏదో లోపల వుందే" అని ఆలోచిస్తూ వుండేవాడు. అది ఆయనతో వుండేవాళ్లకు అందరికీ లోపంగా తెలిసేది. కానీ, బయట అంతా పర్‌ఫెక్టుగా వుంది. అన్ని పనులు చక్కగా చేస్తున్నాడు. అన్నీ అర్థం చేసుకుంటున్నాడు. Everything is Okay! మరి ఒకానొక రోజు ప్రత్యేకంగా మరి బయటకు వెళ్ళినప్పుడు - ఎక్కువగా బయటకు వెళ్ళడు - ప్రత్యేకంగా బయటకు వెళ్ళినప్పుడు చూడటానికి మామూలుగా కంటపడనివి కంటపడినప్పుడు అతని తండ్రి ఎంతో జాగ్రత్త తీసుకునేవాడు. ఇంట్లో ఆయన పరిచారకులు ఎవరికైనా కొంత తెల్లజుట్టు వచ్చినా, తెల్లజుట్టు వాళ్ళను ట్రాన్స్‌ఫర్ చేసేసి నల్లజుట్టు వాళ్ళనూ, అందంగా వుండే వాళ్ళనూ సపర్యలకు పెట్టేవాడు వెంటనే. ఈ విధంగా ఆయన మరి ఎన్నో జాగ్రత్తలు తీసుకునేవాడు - ఎంత మాత్రం వైరాగ్యం బుద్ధుడికి రాకుండా చూసుకోవడానికి!

"అతి సర్వత్ర వర్జయేత్" గదా! ఎక్కువ శ్రద్ధ తీసుకుంటే దానికి విపరీతంగా జరిగే తీరుతుంది! దేని గురించి మనం భయపడ్తామో, అది జరిగే తీరుతుంది!

శుద్ధోధనుడు చాలా ఎక్కువగా జాగ్రత్తలు తీసుకునే సరికి, సరిగ్గా ఆయన దేనికోసం అయితే భయపడ్డాడో అదే జరిగింది. ఒకానొక రోజు బుద్ధుడు బయటకు వెళ్ళి మరి చూడకూడని ముసలితనాన్ని, చూడకూడని రోగాన్నీ, చూడకూడని చావునీ చూసే తీరాడు. తన రథసారథి చన్నుడిని "ఏమిటయ్యా ఇది?" అని అడిగాడు. అప్పుడు ఆ చన్నుడు "స్వామీజీ! ఇవి అందరికీ వస్తాయి; మీకూ వస్తాయి! నాకూ వస్తాయి!" అన్నాడు. "అలాంటి జీవితం అదేం జీవితమయ్యా? వీటి నుండి బయటపడే ముక్తి మార్గం

లేనే లేదా!" అని బుద్ధుడు అడిగాడు.

అప్పుడే ఒక సన్యాసి అటునుంచి అలా వెళుతున్నాడు. "ఆ సన్యాసిని చూడండి సార్, ఆయన ముక్త పురుషుడు; ఆయన వెంట ఎంత మంది వున్నారో! 'ముక్తి' అంటే ఏమిటో ఆయన దగ్గరకు వెళితే తెలుస్తుందేమో గానీ నా దగ్గర ఏం తెలుస్తుంది?" అన్నాడు ఆ చన్నుడు. "సరే! పోయి ఆయన్ని తీసుకురా! పట్టుకురా! రేపు ప్రొద్దునే నేను ఆయనతో మాట్లాడాలి" అన్నాడు బుద్ధుడు. చన్నుడు పోయి ఆ సన్యాసిని మర్నాడు పొద్దున్నే తీసుకు వచ్చాడు.

సన్యాసితో మాట్లాడాడు బుద్ధుడు, "ఏమిటయ్యా నువ్వు సాధించింది? నీ ముఖం చూస్తే ఆనందంగా వున్నట్లుగా కనపడుతున్నావు, ఏం చేశావు?" అని అడిగాడు, "నేను ఇంకా పూర్తిగా ఆనందంగా లేను స్వామీజీ, ఆనంద మార్గం వెతుక్కుంటూ వెళుతున్నాను. ఆనంద మార్గంలో పయనిస్తున్నాను. ఎప్పుడో ఒకప్పటికి తప్పకుండా నాకు ఆనందం దొరికి తీరుతుంది. చాలా మందికి దొరికింది, నాకు కూడా దొరికి తీరుతుంది!" అన్నాడు ఆ సన్యాసి, ఆ సన్యాసికి తెలిసిన గురువుగార్ల అడ్రస్సులు అన్నీ తీసుకుని ఆ మరుసటి రోజు ఎర్లీ మార్నింగ్ గౌతముడు ఇల్లు వదిలి వెళ్ళిపోయాడు.

చన్నుడు తీసుకువచ్చిన సన్యాసి రకరకాల గురువుల పేర్లు చెప్పాడు. 'ఉద్దకరామపుత్రుడు', 'అలారకలముడు'- ఈ విధంగా అందరి దగ్గరికి గౌతమబుద్ధుడు వెళ్ళి, వాళ్ళ దగ్గర వారు ఏమేం చెప్పారో అవన్నీ - వాళ్ళ యొక్క క్రియలూ, అభ్యాసాలూ, ముద్రలు, ఆసనాలూ, ప్రాణాయామ చర్యలూ, రకరకాలు- 'ఇలా ముక్కు మూసుకో' మంటే, ఇలా ముక్కుమూసుకుని, అలా కూర్చుని, నెత్తి మీద శీర్షాసనం వేయమంటే శీర్షాసనం వేసి - ఇలా రకరకాలుగా చేసాడు. ఉపవాసాలు చేశాడు; ఈ గురువు దగ్గరనుంచి ఆ గురవు దగ్గరికీ, ఆ గురువు దగ్గరి నుంచి ఇంకొక గురువు దగ్గరకు వెళ్ళి, తన చుట్టు పక్కల వున్న వారిలో ఎవరెవరైతే ఈ యొక్క సాధనలో వున్నారో, గురువులుగా చలామణీ అవుతున్నారో వాళ్ళందరి దగ్గరకూ వెళ్ళాడు.

ఐదున్నర సంవత్సరాలు తిరిగి, తిరిగి, చివరకు ఎక్కడా సంతృప్తి పొందక ఇక తనకు తానుగానే అన్నీ తెలుసుకోవాలని నిశ్చయించుకుని

ఘోరమైన తపస్సు చేద్దామని చెప్పేసి, తానూ పూర్తిగా ఆహారాన్ని విసర్జించి, తనతో పాటుగా ఇంకొక ఐదుగురు మిత్రులతో అలా తపస్సులో ఉండగా ఆల్‌మోస్ట్, అవసానదశలో ఉన్నప్పుడు ఒకావిడ - సుజాత అనే ఆవిడ ఈ గౌతముడిని చూసి "నీకేమైనా పిచ్చి పట్టిందా? మొత్తం ఈ బొమికలన్నీ, వీపూ కడుపూ రెండూ ఏకమైపోయాయి! నువ్వు చేసే సాధన అంతానూ ఈ శరీరం నిలబడితేనే గదా?" అని చెప్పేసి పాయసం ఇస్తుంది.

ఆయన గమనించి "నిజమే కదా!" అని తలచి, ఆ పాయసం త్రాగేసి బాగా ఆలోచించాడు. ఎవరూ లేరు- తానొక్కడే బాగా ఆలోచించాడు. ఎప్పుడైతే ఆ పాయసం త్రాగేసాడో ఆయన మిత్రులంతా ఈయన్ని వదిలి పెట్టేశారు. "వీడు భోగలాలసుడు అయిపోయాడు! వీడు ఇక పనికిరాడు! వీడి దగ్గర మనం ఏం నేర్చుకుంటాం?" అని చెప్పేసి

ఆ మిత్రులంతా వెళ్ళిపోయారు. తానొక్కడే కూర్చున్నాడు - ఆలోచించాడు. చిన్నప్పుడు తాను ఎంతో మంది ఆస్ట్రల్ మాస్టర్స్‌ను చూసినట్లు గుర్తు చేసుకున్నాడు. నిజానికి చిన్నపిల్లలెప్పుడూ ఎంతో చక్కగా ఆస్ట్రల్ మాస్టర్స్ అందరితో కలిసి జీవిస్తారు. ఒక ప్రక్కన ప్రాపంచికం గానూ, ఇంకొక ప్రక్కన ఆస్ట్రల్ మాస్టర్స్‌తోనూ తాను జీవించాడు. చిన్నగా వున్నప్పుడూ, అవన్నీ ఇప్పుడు గుర్తుకు వచ్చాయి. ప్రతి మనిషికీ ఇలాంటి అనుభవాలు ఉంటాయి. చిన్నప్పుడు అందరికీ దివ్యచక్షువు అనుభవాలు వుంటాయి- దేనికంటే, దివ్యచక్షువు తెరుచుకుని వుంటుంది. ఆ చిన్నప్పటి శైశవస్థితిలో తరువాత అందరూ మర్చిపోతారు. ఎవరైనా చిన్నపిల్లలు "అమ్మా! నాకు చనిపోయిన తాతగారు కనబడ్డారు!, మాట్లాడారు!" అంటే, "పిచ్చి పిచ్చిగా మాట్లాడకు! నీకు దెయ్యం పట్టిందా?" అని అంటారు. అలా వాళ్ళ నోరు మూసేస్తారు అన్నమాట. నిజంగానే చనిపోయిన తాతగారు వాడికి కనబడ్డారు, వాడితో మాట్లాడారు, కాని ఈ తల్లిదండ్రులు ఉన్నారే, వారు పరమ మూర్ఖులు. భయపడిపోయి ఆ శిశువుని దబాయించేసి, చిన్నపిల్లల యొక్క దివ్యచక్షువును బంధించేస్తారు. అదే జరుగుతుంది ప్రతి ఇంట్లోనూ.

ఎక్కడైతే, ఇంట్లో ధ్యానులూ, యోగులూ ఉంటారో, వాళ్ళు మటుకు "ఆహా! వాళ్ళు నీకు కనబడ్డారా?" తాతగారు ఏం చెప్పారయ్యా? నా తరపున కూడా ఒక ప్రశ్న వెయ్యి నువ్వు" అని చెప్పేసి అలా సహకరిస్తారు. అలా ప్రోద్బలం ఇస్తారన్నమాట - అలా చెయ్యాలి. కానీ అలా ఎక్కడా జరగటం

లేదు కదా. గౌతమ బుద్ధుడి తల్లిదండ్రులు కూడానూ ఈ యోగులూ, ధ్యానులూ కానే కాదు - వారూ అందరిలాగే సగటు మనుష్యులు.

కనుక, ఇక్కడీయన ఆ పాయసం కొంత త్రాగి, ఏకాంతంగా కూర్చున్నప్పడు, ఆ ఐదుగురు సహచరులూ వెళ్ళిపోగా, చిన్నప్పటి ఆ యొక్క అనుభవాలు అన్నీ గుర్తుకు వచ్చాయి. "అప్పడు నా యొక్క ఆ అమాయక స్థితిలో 'ఏ ధ్యాన స్థితి' లో, 'ఏ ధ్యాన ప్రక్రియ'ను చేపట్టి ఉన్నాను?" అని ఆలోచించాడు. ఏ ప్రత్యేక ధ్యానప్రక్రియా లేదు! ఏ కుంభకమూ లేదు! ఏ ప్రాణాయామమూ లేదు! ఏ శీర్షాసనమూ లేదు, ఏ మంత్రమూ లేదు. కనుక, ఇవన్నీ కూడానూ తప్పడు పద్ధతులని అప్పడు తెలుసు కున్నాడు.

మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు, ప్రొద్దున్నే కళ్ళు మూసుకుని సహజంగా వున్న ఉచ్ఛ్వాస నిశ్వాసలనే గమనించడం మొదలుపెట్టాడు.

"నా అంతట నేనే అంతా తెలుసుకోవాలి; చిన్నపిల్లవాణ్ణి అయిపోవాలి" అని అనుకున్నాడు. ఎలాగైతే జీసస్‌క్రైస్ట్ చెప్పాడో - Unless You become like a child. you cannot enter the Kingdom of God" అంటే, "నువ్వు చిన్నపిల్లవాడి తత్వంలోకి ప్రవేశించకపోతే దేవుని రాజ్యంలో ప్రవేశించలేవు"- అని జీసస్ క్రైస్ట్ చెప్పిన సిద్ధాంతాన్ని గౌతమ బుద్ధుడు తనకు తానుగా తెలుసుకున్నాడు. ఆయనకు ఇంకొకరు చెప్పలేదు! బుద్ధుడు తనకు తానుగా తెలుసుకున్నది, తరువాత శిష్యులందరికీ చెప్పగా, వాళ్ళందరూ కూడా తమకు తాముగా తెలుసుకున్నది తమ తరువాత వారికి చెప్పగా ఆ పరంపరను జీసస్‌క్రైస్ట్ కూడా తెలుసుకుని ఇంకొకళ్ళకు చెప్పాడు.

జీసస్ క్రైస్ట్ గురువు దగ్గర తెలుసుకుని చెప్పాడు- గౌతమ బుద్ధుడు తనకు తానుగా కనుగొన్నాడు - ఏమిటి? Unless you become like a child you cannot enter the kingdom of God" - నిజానికి ఇది బుద్ధుడు కనుక్కొన్నది. అయితే, జీసస్‌క్రైస్ట్ నోటి ద్వారా ప్రపంచమంతా వ్యాప్తమయింది.

కనుక, గౌతమబుద్ధుడు ఆ యొక్క సహజమైన ఆ శిశుదశ లోకి వెళ్ళిపోయాడు. జాగృతావస్థలోనే శిశుఅవస్థలోకి వెళ్ళిపోయాడు. ఎలాగైతే హిప్నాటిక్ రిగ్రెషన్‌లో మనం ఇరవై ఐదు ఏండ్ల నుంచి 'ఇరవై ఏళ్ళు' ,

'పదిహేను ఏళ్ళు', 'పదిఏళ్ళు', 'ఐదుఏళ్ళు' అని చెప్పేసి ఒకానొక హిప్నాటిస్ట్ అతన్ని శిశుదశలోకి, శైశవదవలోకి తీసుకుని వెళ్ళినప్పుడు చిన్నప్పటివన్నీ ఎలాగైతే గుర్తుకు వస్తాయో అదే విధంగాననమాట. ఇంకా వెనక్కి తీసుకువెళ్తే గర్భంలో ఉన్న స్థితులూ, ఇంకా వెనక్కు తీసుకువెళితే గత జన్మ స్థితులూ, గత జన్మ స్మృతులూ అన్నీ గుర్తుకు వస్తాయన్నమాట. అదే విధంగా గౌతమ బుద్ధుడు రకరకాల సాధనలు చేసి చేసి వున్నాడు, అపరిమితంగా పరిశ్రమించి వున్నాడు, అలిసిపోయి వున్నాడు, మళ్ళీ చక్కగా కూర్చున్నాడు, వెంటనే ఫ్రెష్‌గా ఆ యొక్క పాయసం తీసుకున్నాడు.

మిగతా ఐదుగురి యొక్క ఆ వైబ్రేషన్స్ లేవు కనుక హాయిగా వున్నాడు - ఒక్కడే వున్నాడు. ఏకాంతంగా వున్నాడు, కూర్చున్నాడు, కళ్ళు రెండూ మూసుకున్నాడు. ప్రొద్దున్నుంచి సాయంత్రం వరకూ కూర్చుంటే, సాయంత్రానికి ఆయన దివ్య చక్షువు సంపూర్ణంగా తెరుచుకుంది!

రాత్రి అంటే మూడు జాములు వుంటాయి. రెండున్నర గంటలు ఒక 'జాము' అని చెప్తారన్నమాట. ఈ మూడు జాములలో ఆయనకు సంపూర్ణమైన పరిజ్ఞానం లభించింది! మొట్టమొదటి జాములోనే అతని దివ్యచక్షువు తెరుచుకుని తన గత జన్మలన్నీ ఒకదాని తరువాత ఒకటి ఆయన మూడవ కన్ను స్క్రీన్ ముందర కనబడటం మొదలుపెట్టింది- అన్నీ చూసాడు! ఒకసారి ఆడగా, ఒకసారి మగగా, ఒకసారి నల్లగా, ఒకసారి ఎర్రగా, రకరకాల చర్మాలతో, రకరకాల దేహాలతో, రకరకాల రూపురేఖలతో, రకరకాల లింగబేధాలతో ఆయన తనను తాను ఎన్నో జన్మలుగా ఈ దుఃఖ నివారణా విధానాన్నీ అందరికి చెప్పడం కోసం తాను పుట్టాననీ- తన వర్తమాన జన్మ కారణాన్ని తెలుసుకున్నాడు.

కనుక, ఈ దుఃఖం, దుఃఖం యొక్క కారణం, తరువాత దుఃఖకారణం పోవటానికి మార్గం- ఇవన్నీ కూడానూ ఆయన ఆ యొక్క మూడవ జాములోనే తెలుసుకున్నాడు.

మొట్టమొదటి జాములో ఏం తెలుసుకున్నాడు? అన్ని జన్మల అన్ని శరీరాలనూ తెలుసుకున్నాడు. తన శరీరాల పరంపరను తెలుసుకున్నాడు. రెండవ జాములో తన కర్మ పరంపరలను చూసుకున్నాడు. "ఏ పని చేసాడు? దాని ఫలం ఏమిటి?" అనేది చూసుకున్నాడు. మూడవ జాములో తన యొక్క ఆ కార్య-కారణ సంబంధాన్ని తెలుసుకున్నాడు. దుఃఖ నివారణోపాయాన్ని తెలుసుకున్నాడు.

దుఃఖ నివారణోపాయాన్ని తెలుసుకున్న వెంటనే, “ఇంత కష్టమైనది, నేనే ఎంతో కష్టపడి సంపాదించాను! ఎంత మందికి ఇంత సహనం వుంటుంది?! ఇంత ఓర్పు వుంటుంది?! జీవితంలో ఇంత అంకితభావం వుంటుంది!? ఇది నేనొక్కడినే తెలుసుకోవడం వల్ల ఎవరికీ లాభం లేదు కదా!” అని కొంత నిస్పృహ చెందాడు.

వెంటనే ఒక ఆస్ట్రల్ మాస్టర్ కనబడి, “నువ్వు ఇలా నిస్పృహ చెందితే ఎలా? నీలో ఎంతో శక్తి వుంది, లక్షమందికి చెప్పు, అందులో ఒక్కడైనా ఉండడా? నీలాంటివాడు? నిజమే! నీలాంటి వాడు వుండడం కష్టమే! కానీ లక్షమందికి చెప్పు, అందులో ఒక్కడైనా వుంటాడు కదా! నువ్వు చెప్పకపోతే ఆ ఒక్కడు కూడా ఇది తెలియకుండా పోతాడు కదా! వాడు మళ్ళీ సొంతంగా తెలుసుకోవడానికి ఎంతో కష్టపడతాడు, కనుక, నువ్వు ఇంక “ధర్మ ప్రచారానికి బయలు దేరాలి” అని అన్నాడు.

సరే! ఇక బయలుదేరాలి! ఎవరికి చెప్పాలి మొట్టమొదట? మొట్టమొదట తన గురువుగార్లకే చెప్పాలి. అలారకలముడు, ఉద్దకరామపుత్రుడు-వారిని వెంటనే తన మూడవ కన్నుతో చూసాడు. ఎక్కడ వున్నారో అని తెలుసుకున్నాడు. వారు ఇద్దరూ అప్పటికే తమ శరీరాలను వదిలిపెట్టేసారని తెలుసుకున్నాడు. My dear friends! చూసారా ఆయనకు జ్ఞానోదయం అయిన తక్షణమే జ్ఞానప్రచారం చెయ్యాలని ఆయన తన తక్షణకర్తవ్యం గుర్తించాడు!

1979 సంవత్సరంలో నాకు కూడా ఇదే విధంగా జ్ఞానోదయం అయినప్పుడు, ఒక్క క్షణం నాకూ అనిపించింది, నాకు ఈ “ప్రపంచం అంతా ఎందుకు? హిమాలయాలకు వెళ్ళిపోతాను” అని ఒక్క క్షణం మానసికంగా నేను హిమాలయాలకు వెళ్ళిపోయాను. అయితే, వెంటనే మళ్ళీ తిరిగి వచ్చేసాను. “హిమాలయాల్లో మనం ఏం చేస్తాం! తెలుసుకోవలసింది అంతా ఇక్కడే తెలుసుకున్నాం కదా! కర్నూల్ లోనే! ఇంట్లోనే! అందుచేత ఇక్కడే అందరికీ చెప్పాలి కానీ హిమాలయాలకు పోయి ఏం చేస్తాం?”

ఒక్క క్షణం నాకు వైరాగ్యం ఆవహించింది. అయితే ఆ ఒక్క క్షణంలోనే మళ్ళీ వివేకం ఉదయించింది. ఒక్క క్షణంలోనే నా సన్యాస జీవితం అయిపోయింది! హిమాలయాలకు వెళ్ళటమూ అయిపోయింది;

మళ్ళీ తిరిగి రావటమూ అయిపోయింది. అప్పటినుంచి ఇంట్లోనే ఉంటూ, ఆఫీసులోనే ఉంటూ, ఎక్కడెక్కడ నేను పనిచేస్తున్నానో అక్కడే అందరికీ ధ్యానవిద్యను నేర్పించటం, మరి ఈ యొక్క ఆత్మజ్ఞాన విధానాన్నీ, దుఃఖనివారణోపాయాన్నీ అప్పటినుండే - 1979 నుండే చెప్పడం మొదలు పెట్టాను; ఎక్కడ వున్నానో అక్కడే!

గౌతమబుద్ధుడు కూడానూ వెంటనే తాను ఎక్కడ వున్నాడో అక్కడనుంచే మొదలుపెట్టాడు - My dear friends! My dear Masters! My dear Gods! పిరమిడ్ మాస్టర్స్ అందరికీ కూడానూ అత్యద్భుతమైన విశేషమైన ఆదర్శమూర్తి గౌతమబుద్ధుడు. ఆయన జీవిత చరిత్రతోనే మన అందరి జీవిత చరిత్రలూ ముడిపడి వున్నాయని గ్రహించాలి.

ఆయన జీవిత విధానమే మన జీవిత విధానం! ఆయనకు ఎంత తృష్ణ వుందో, ఎంత జ్ఞానపిపాస వుందో, ఎంత అకుంఠిత దీక్ష వుందో, మరి మనకు కూడా అంతటి అకుంఠిత దీక్ష, అంతటి జ్ఞాన పిపాస వుండాలి! ఆయన తన దివ్యచక్షువును తెరిపింప చేసుకున్నాడు. ప్రతి ఒక్కళ్ళు కూడానూ దివ్యచక్షువును తెరిపింప చేసుకోవాలి. ఇంకొకళ్ళు ఆయనకు సహాయపడలేరు. ఎప్పుడూ కూడానూ మంచి పనిచేసేవాళ్ళను ఆటంక పరిచేవాళ్ళే ఉంటారు, కానీ సహాయపడేవారు ఎవరూ ఉండరు. ఆటంకాలను అధిగమించాలి. కనుక, "నాకు ఎవరో సహాయం చేస్తారు" అని ఎప్పుడూ ఆశించకూడదు. ఆటంకం చేసే వాళ్ళందరినీ అధిగమించాలి.

నాకు కూడా నా ఇంట్లో ఎవరి సహకారమూ లేదు. నా అంతట నేను సత్యాన్ని కనుక్కున్నాను. మరి My dear friends! My dear Masters! My dear Gods! My dear Buddhas! బుద్ధుడి గురించి మరి కొంత, బుద్ధ ప్రబోధం గురించి మరి కొంత, సవివరంగా తెలుసుకుందాం.

గౌతమబుద్ధుడు ఎప్పుడైతే తన దివ్యచక్షువుతో తన గురువుగార్లు ఇద్దరు కూడానూ తమ తమ శరీరాలను వదిలిపెట్టేశారని తెలుసుకున్నాడో, వెంటనే తన ఐదుగురు సహచర్ల మీదకూ దృష్టిని సారించాడు. మళ్ళీ చూసాడు, ఈయనేమో 'గయ' లో వున్నాడు, వాళ్ళేమో 'గయ' ను వదిలిపెట్టేసి సారనాథ్, కాశీ దగ్గరకు వెళ్ళిపోయారు. సుమారు రెండువందల యాభై కిలోమీటర్లు. "ఓహో! వీళ్ళందరూ అక్కడకు

చేరారా?" అని చెప్పేసి "వాళ్ళకు చెప్పాలి కదా; నా సహచరులు కదా" అని ఇహ వాళ్ళ దగ్గరకు ప్రయాణం మొదలు పెట్టాడు. వాళ్ళ దగ్గరకు, సారనాథ్‌కు చేరుకున్నాడు. ఆ ఐదుగురు ఆ క్షణం వరకూ ఇంకా ఏవో మంత్రాలు చదువుకుంటూ, ఉపాసనలు చేసుకుంటూ, ఇంకా కఠోరమైన ప్రాణాయామ చర్యలను చేసుకుంటూ వున్నారు. ఇంతలో వారికి దూరం నుంచి ఒక పరిచితమైన వ్యక్తి వస్తూ వున్నట్లు అనిపించింది. దగ్గర దగ్గరకు వస్తూ వుంటే "ఇతను మనవాడు కదా?" అన్న ఆనందం కొంచెం, జుగుప్స కొంచెం "వీడేమిటి మళ్ళీ మన దగ్గరకు వచ్చాడు? వీడు మనల్ని కూడా పాడు చేస్తాడా ఏమిటి?" అని రకరకాల ఆందోళనలతో వాళ్ళున్నారు. దగ్గరకు వస్తున్నకొద్దీ కాస్త తిరస్కార భావంతోనూ వారు వున్నారు.

అయితే గౌతమబుద్ధుడు సారనాథ్‌లోని తన మిత్రులను సమీపిస్తున్న కొద్దీ వారు తమకు తెలీకుండానే పరవశులు అయిపోతున్నారు. ఏదో తెలియని స్థితి వారిని ఆవహిస్తోంది! తీరా దగ్గరికి వచ్చేసరికి "ఏమయ్యా గౌతమా!" అన్నారు. అప్పుడు ఆయన, "నన్ను గౌతమా' అని పిలవద్దు! 'బుద్ధా' అని పిలవండి" అని తన మొట్టమొదటి ప్రవచనంగా వాళ్ళ వాక్ క్షేత్రాన్ని సరిచేశాడు.

'గౌతమబుద్ధుడు' అంటే 'వాక్ క్షేత్రాన్ని సరిచేయుట'మని తెలుసుకుందాం. ఎందుకంటే మొట్టమొదటగా ఆయన నోటిలోంచి వచ్చిన ప్రవచనం "వాక్ క్షేత్రాన్ని సరిచేసుకోవోయ్" అని చెప్పేసి; ఆయన సహచరులు "ఏమిటి మిత్రమా! "గౌతమా!" అన్నప్పుడు, "నేను మీ మిత్రుడను కాను; నా పేరు 'గౌతముడు' కాదు; నేను 'బుద్ధుడి'ని; ఇక నుంచి నన్ను 'బుద్ధుడని' పిలవండి. నన్ను 'బుద్ధా' అని పిలవండి అని మొట్టమొదటి సారిగా తన సహచరులను ఆయన హెచ్చరించాడు.

హెచ్చరికతోనే ఆయన యొక్క ప్రభోధం, ఆ యొక్క బుద్ధధర్మ ప్రభోధం మొదలైంది. వాక్ క్షేత్రాన్ని సరిచేయడంతోనే ఆయన జ్ఞాన ప్రచారం మొదలైంది. కనుకనే పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మాస్టర్లందరికీ 'వాక్‌క్షేత్రం' అన్న ఈ యొక్క సబ్జెక్టు వెరీ, వెరీ ఇంపార్టెంట్. నోటిలోంచి ఏ మాట వచ్చినా సరిగ్గా మాట్లాడాలి. లేకపోతే నోరు మూసుకుని కూర్చోవాలి. సరిగ్గా నోరు విప్పకపోతే నోరు సరిచేయ బడుతుంది.

ఇది బుద్ధ సాంప్రదాయం, బుద్ధుడు ప్రప్రథమంగా తన సహచరుల యొక్క ఆ సంబోధాన్ని సరిచేశాడు. "గౌతమా' అని పిలవద్దు; 'బుద్ధా' అని పిలవండి' అని చెప్పేసి వెంటనే కూర్చున్నాడు, ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా "నేను ఏది సాధించానో అది మీకు చెపుతాను, కూర్చోండి" అని , వెంటనే వాళ్ళ చేత చేతులు రెండూ కలిపి వ్రేళ్ళలో వ్రేళ్ళు పెట్టించి కళ్ళు రెండూ మూయించి "శ్వాస మీద ధ్యాస" - "ఆనాపానసతి" నేర్పించాడు, మైడియర్ ఫ్రెండ్స్!

గౌతమబుద్ధుడు కనుగొన్నది "శ్వాస మీద ధ్యాస" - 'ఆనాపానసతి'.

'ఆన' అంటే 'ఉచ్ఛ్వాస';

'అపాన' అంటే 'నిశ్వాస';

'సతి' అంటే 'కూడుకుని ఉండటం';

అంటే, చిన్నప్పటి నుండీ అందరూ కూడానూ సహజమైన శ్వాసతో ఉన్నారు. కానీ ఆ శ్వాస మీద 'ధ్యాస' పెట్టలేదు - చిన్నప్పుడు ఏనాడూ. సహజమైన ఆ శ్వాస మీద కొంచెం మన ధ్యాస పెట్టేసరికి ఆ 'మూడవకన్ను' విప్పారుతుంది. పోగొట్టుకున్న 'మూడవకన్ను'ను మళ్ళీ రాబట్టుకుంటాం. Childhood is Paradise! Adult-hood is Paradise lost! In the Adult-Hood we should regain the paradise! That is done through- 'శ్వాస మీద ధ్యాస!' అది 'శ్వాస మీద ధ్యాస' ద్వారానే సాధ్యం. చిన్నప్పుడు మనం స్వర్గంలో వుంటాం; కానీ పెద్దగా అవుతున్న కొద్దీ ఆ స్వర్గాన్ని పోగొట్టుకుంటాం. "స్వర్గం' అంటే 'మూడవ కన్ను', మన 'నిర్మలత్వం', మన నిశ్చలత్వం', మన 'దివ్యచక్షువు' - అదే 'స్వర్గం'.

ఇవన్నీ శైశవదశలో బాల్యదశలో మనతోనే వుంటాయి. కానీ, ఈ సమాజంలో ఈ కృత్రిమ సమాజంలో, ఈ భయంకరమైన సమాజంలో, - మరి "కేవలం శరీరమే నేను" అనుకునే వాళ్ళ యొక్క సమాజంలో - ఆ యొక్క 'నిర్మలత్వం' ఆ యొక్క దివ్యచక్షువు', ఆ యొక్క సున్నితత్వం' పోగొట్టుకుని ఆ స్వర్గాన్ని పోగొట్టుకుంటాం. The Paradise is lost! దాన్ని మళ్ళీ తిరిగి రాబట్టుకోవాలంటే, మళ్ళీ అలాంటి శైశవస్థితిలోనే, నిర్మలస్థితిలోనే, ఆ నిశ్చలస్థితిలోనే , ఆ యొక్క సున్నితత్వస్థితిలోనే, ఆ యొక్క దివ్యచక్షువును సంపాదించుకోవాలి - The Paradise Should be regained My dear friends!

గౌతమ బుద్ధుడు ఆ విధంగా తన ఐదుగురు సహచరులనూ

వెంటనే ధ్యానంలో కూర్చోపెట్టాడు; కళ్ళు రెండూ మూయించాడు. "శ్వాస మీద ధ్యాస" పెట్టించాడు. రెండు గంటల సేపు ధ్యానం చేయించాడు. వాళ్ళూ అలా కూర్చుండిపోయారు! రెండు గంటల తర్వాత వాళ్ళు కళ్ళు తెరిచారు. అపారమైన అనుభవాలు వాళ్ళకూ కలిగాయి! వాళ్ళ దివ్యచక్షువుతో వాళ్ళూ తమ తమ జన్మ పరంపరలను చూసుకున్నారు! ఆ ఐదుగురూ కూడానూ బుద్ధుడికి అంకితం అయిపోయారు. 'ఒక్కడు' కాస్తా 'ఆరుగురు' అయ్యారు - సారనాథ్‌లో ఆరుగురు అయ్యారు.

బుద్ధుడూ, అతని ఐదుగురు మిత్రులూ కలిసి ధ్యాన ప్రచారం ప్రారంభించారు.

వీరు తమ ప్రచారంలో ఈ 'ఆత్మ' అనే 'పదార్థం'ను పూర్తిగా వదిలిపెట్టేశారు. ఆత్మ గురించి 'తర్కం' వదిలిపెట్టేశారు. 'ఆత్మ' అనే పదం గురించి మాట్లాడడమే వదిలి పెట్టేశారు. 'దేవుడనే' పదం, 'ఆత్మ' అనే పదం, వీటి గురించి ప్రస్తావన వదిలి కేవలం 'కర్మ సిద్ధాంతం' 'పునర్జన్మ సిద్ధాంతం' వీటి గురించే ప్రబోధించారు. "పరలోకాలు ఉన్నాయా? లేదా?" అని చెప్పేసి పబ్లిక్‌గా వేరే మాట; ప్రయివేట్‌గా వేరేమాట. శిష్యపరంపరతో బుద్ధుడు అన్నీ మాట్లాడేవాడు, కానీ పబ్లిక్‌లో మటుకు ఏది మాట్లాడాలో అదే మాట్లాడాలి. ఎలా మాట్లాడాలో అలానే మాట్లాడాలి. పబ్లిక్‌గా చెప్పినవన్నీ పూర్తిగా ఈ బుద్ధ గ్రంథాలలో పదిల పరచబడివున్నాయి. ప్రైవేట్‌గా చెప్పబడినవి కూడానూ కొన్ని పదిలపరచబడ్డాయి. ఎన్నో పదిలపరచబడకుండానే మిగిలిపోయాయి.

మై డియర్ ఫ్రెండ్స్! బుద్ధుడు 'నేను' అనే పదార్థం ఎక్కడా లేదు" అని వాక్కు ఇచ్చాడు. అది ఎవరికి అర్థం కాలేదు- అంటే, పరిమితమైన 'నేను' , సమాజం అనుకునే 'నేను' , 'నేను ఫలానా తండ్రికి కొడుకును' అనుకునే 'నేను' - అలాంటివి ఎక్కడా లేవు- అదంతా హుళక్కి! అసలు 'నేను' , సర్వాత్మకమైన 'నేను' - ఇవన్నీ వున్నాయి.

బుద్ధుడు ఆత్మ అనే పదాన్ని ఎప్పుడూ ఉపయోగించలేదు. ఉపయోగించినా అది తన యొక్క 'ఈ జీవితాని'కి ఉపయోగించాడు కానీ, శరీరానికి విభిన్నంగా, ఆత్మ పరంగా ఎప్పుడూ ఉపయోగించలేదు.

మై డియర్ ఫ్రెండ్స్! గౌతమబుద్ధుడు మొట్టమొదటి నుంచీ "ఎవరికి వారే యమునాతీరే! ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి!" అన్న

సూత్రాన్ని ప్రతిపాదించాడు; అంతవరకూ అందరూ కూడానూ “ఎవరో వచ్చి రక్షిస్తారు; ఎవరో ‘పరమాత్మ’ అని వారిని మనం శరణాగతి పొందుదాం!” - ఇలాంటివన్నీ చెప్పి మానవాళిని సర్వనాశనం చేసారు బుద్ధునికి పూర్వం.

సకల వేదాల్లో వుంది, “మీరు గాయత్రీ మంత్రం జపం చేసుకోండి, ఆ సూర్యుణ్ణి, మరి ఆ సవితృడ్ని ప్రార్థిస్తే ఆయన మనకు బుద్ధిని ప్రచోదయం చేస్తాడు” అని చెప్పేసి అలాంటివన్నీ తీసి గట్టున పడేశాడు గౌతమబుద్ధుడు.

ఇంకా ఆయన ఏమన్నారంటే, “అభిత్థరేథ కల్యాణే”; అంటే, “మంగళదాయకమైన కర్మలను చేసేందుకు త్వరపడాలి. “ఏదోలా జీవితం గడపడం కాదు. ఎలా జీవితం గడపాలో అలా గడపాలి; అభివృద్ధిని సాధించాలి; మరి జీవితంలో అభివృద్ధి అంటే ధనాభివృద్ధి కాదు. మంగళదాయకమైన కర్మలను చేయాలి.

“నిర్వాణమే పరమ సుఖం” అన్నారాయన. “విశ్వాసమే పరమ బంధువు” “సంతుష్ట పడడమే పరమ ధనం”.

**“ఆరోగ్య పరమోలాభః సన్తుహిపరమం ధనమ్**

**విశ్వాస పరమోఞ్ఞాతిః నిర్వాణం పరమం సుఖమ్”**

“శరీరం యొక్క ఆరోగ్యమే పరమ లాభం, మనస్సు ఎప్పుడూ సంతుష్టంలో వుండడమే పరమ ధనం. మరి మన శక్తి మీద మనం నమ్మకం కలిగి వుండడమే పరమబంధువు. విశ్వాసమే పరమబంధువు. దుఃఖ రాహిత్యమే పరమ సుఖం” అన్నారు.

**“అప్పమత్తోహి ఝాయన్తో, పప్పోతి విపులం సుఖమ్”**

ధ్యానం, ఆయన యొక్క విశిష్టమైన ఆయుధం. అందరినీ ధ్యానంలో కూర్చోబెట్టేవాడు - తరువాతే ప్రవచనం. ధ్యానం లేకుండా ప్రవచనం ఎప్పుడూ లేదు. ధ్యానం లేకుండా మాట్లాడేది లేదు. “ధ్యానం చెయ్యి! తరువాత మాట్లాడుదాం! ధ్యానం లేకుండా ప్రవచనం లేదు”, “అప్రమత్తుడై ధ్యానం చేసేవాడు విపులమైన సుఖం పొందుతాడు” అనేవాడు. ఎప్పుడూ జాగురూకతలో వుండమని చెప్పేవాడు.

**“అప్పమాదో అమతపదం, పమాదో మచ్చునోపదం”**

“అప్రమత్తతే అమృతత్వం, ప్రమత్తతే మృత్యువుతో సమానం”. అప్రమత్తత అంటే జాగరూకత, ప్రమత్తత అంటే జాగరూకత లేకపోటం. ప్రతి క్షణంలోనూ ఎరుకలో, జాగరూకతలో వుండాలి. ఎవరితో

మాట్లాడుతూన్నమో? ఏం మాట్లాడుతున్నామో? ఏం వింటూన్నామో? ఎవరితో భోంచేస్తున్నాం? ఎలా భోంచేస్తున్నాం? ఎంత భోంచేస్తున్నాం? ఎలా భోంచేస్తున్నాం?.....ఈ విధంగా ప్రతి విషయంలోనూ విశేషమైన జాగరూకత- ఎంత నిద్రపోవాలి? ఎప్పుడు నిద్ర లేవాలి? ముందే నిశ్చయిం చుకోవాలి. నిశ్చయించుకోకుండా ఇష్టం వచ్చినట్టు పడుకుంటామేమిటి? ఎప్పుడు లేవాలో నిశ్చయించుకుని అప్పడే పడుకోవాలి! ఎంత తినాలో నిశ్చయించుకుని అంతే తినాలి. అంటే ప్రతి విషయంలోనూ.... ఎంత మాట్లాడాలో నిశ్చయించుకుని అప్పడే మాట్లాడటం మొదలు పెట్టాలి. మై డియర్ ఫ్రెండ్స్! దీన్నే అప్రమత్తత అంటారు. గౌతమబుద్ధుడు ప్రతి విషయంలోనూ అత్యంత అప్రమత్తతతో వుండేవాడు. Every word, every thought and every deed, My dear friends, you must be highly aware , not a single word should be stupid! కనుక, పిరమిడ్ మాస్టర్స్ అందరికీ అప్రమత్తత అనేది Very very important thing.

గౌతమబుద్ధుడు ప్రతి మనిషినీ తనను తానే నడిపించుకోమని చెప్పాడు. తనను తానే పరిశీలించుకోమని చెప్పాడు. "ఓ శ్రమణుడా! నిన్ను నీవే నడిపించుకో! నిన్ను నీవే పరిశీలించుకో!"

**"అత్తనా చోదయత్తానం, పటిమాసే అత్తమత్తనా"**

"నిన్ను ఎవరు నడిపిస్తారు? ఏ శక్తీ నిన్ను నడిపించదు. నిన్ను నీవే నడిపించుకోవాలి; బయట నిన్ను నడిపించే ఏ శక్తీ లేదు. నిన్ను నీవే పరీక్షించుకోవాలి. నిన్ను పరీక్షించే ఇంకొకడు ఎవడూ లేడు! ఎవడికి నీ మీద ఇంట్రెస్టు? ఎవరికి పట్టింది నీ గురించి? నీ గురించి నువ్వే పట్టించుకోవాలి? నిన్ను నీవే నడిపించుకోవాలి."

**"అత్తనా చోదయత్తానం పటిమాసే అత్తమత్తనా"**

అంటే, "నిన్ను నీవే నడిపించుకో; నిన్ను నీవే పరీక్షించుకో", "ఎనలైజ్ యువర్ సెల్ఫ్"; "లీడ్ యువర్ సెల్ఫ్".

"లీడ్ కైండ్‌లీ లైట్" అని చెప్పేసి ఏదో బయటవున్న లైట్‌ను కోరుకుంటే, అది ప్రార్థనాతత్వం, అబుద్ధతత్వం. నిన్ను 'లీడ్ ' చేసేవాడు ఎవడూ లేడు. నిన్ను నీవే పరీక్షించుకోవాలి.

**"అత్తాహి అత్తనో నాథో, అత్తాహి అత్తనో గతి"**

**"ఆత్మకు ఆత్మే గతి; ఎవరికి వారే గతి!"**

"అల్లా మాలిక్ హై" అంటాం; ఎవరో 'అల్లా' అంట, ఎవరో 'మాలిక్'

అంట!  ఎవరు అల్లా? ఎవరు నీకు మాలిక్? నీకు నువ్వే మాలిక్!

ఎవరూ నీకు మాలిక్ కాదు ఇక్కడ! 'అల్లా' ఎవరూ లేరిక్కడ. కనుక, మైడియర్ ఫ్రెండ్స్! మనల్ని నడిపించే వాడు ఎవడూ లేడు. ఆత్మకి ఆత్మే ప్రభువు.

"అత్తాహి అత్తనో నాథో, అత్తాహి అత్తనో గతి"ఇది అనుక్షణం ఎరుకలో వుండడమే బుద్ధత్వం. దాన్ని మనం అభ్యాసం చేయాలి. సంగీతంలో 'శృతి'లో వుండడం ఎలా అభ్యాసం చేస్తామో అలా ధ్యాన అభ్యాసం చేయకపోతే ఆ ఆత్మస్మృతి ఆ జ్ఞానలయ మనకు రాదు.

'బుద్ధత్వం' అంటే, ఎప్పటికప్పుడు "నన్ను నేనే రక్షించుకోవాలి', 'నన్ను నేనే పరీక్షించుకోవాలి", "నన్ను నేనే నడిపించుకోవాలి" అన్న ఆ యొక్క జాగరూకతతో అప్రమత్తతతో వుండటమే.

అభ్యాసంతోనే అన్నీ వస్తాయి. సంగీత గురువులతో తిరిగితే సంగీతం వస్తుంది. క్రికెటర్స్‌తో తిరిగితే క్రికెట్ వస్తుంది. బుద్ధుళ్లతో తిరిగితే బుద్ధత్వం వస్తుంది. ఇదంతా సహజంగానే జరుగుతుంది. అయితే బాగా తిరగాలన్నమాట. గౌతమ బుద్ధుడితో ఎంతోమంది చేరి ఒక పెద్ద సంఘంగా తయారైంది. అదే 'బుద్ధ సంఘం'.

"బుద్ధం శరణం గచ్ఛామి!"

"సంఘం శరణం గచ్ఛామి

"ధర్మం శరణం గచ్ఛామి!"

అంటే, "ఆ యొక్క గౌతమబుద్ధుడి శరణు కోరి నేను వెళ్తున్నాను. ఆ గౌతమ బుద్ధుడి చుట్టూ ఉన్న ఆ అత్యద్భుతమైన, ఆ సంఘం వుంటే, ఆయన శిష్య పరిగణం వుంటే, వారందరి యొక్క శరణు కోరి వెళ్తున్నాను. బుద్ధుడు ప్రబోధం చేసిన ప్రవచనం వుందే, బుద్ధుడు అందరికీ నేర్పించిన ఆ యొక్క విద్య వుందే, ఆ యొక్క ధర్మం వుందే, ఆ యొక్క శాస్త్రం వుందే - ఆ శాస్త్రం యొక్క శరణు కోరి నేను వెళ్తున్నాను" "బుద్ధం శరణం గచ్ఛామి!" , "సంఘం శరణం గచ్ఛామి!", "ధర్మం శరణం గచ్ఛామి!" అనేవాడు.

"సంఘం శరణం గచ్ఛామి" అంటే సజ్జన సాంగత్యం. బుద్ధుడి దగ్గర వుండే వాళ్ళందరి దగ్గరా మనం నేర్చుకోవాలి- ఒక్క బుద్దుడి దగ్గరే కాదు, కనుక, "సంఘం శరణం గచ్ఛామి", "బుద్ధుడు చెప్పిన ప్రవచనాలు గమనించడం, "ధర్మం శరణం గచ్ఛామి". బుద్ధుని జీవితాన్ని, బుద్ధుడు మాట్లాడే తీరునూ, బుద్ధుడు జీవించిన తీరునూ గమనించడం - "బుద్ధం

శరణం గచ్ఛామి".

ఆయన చెప్పిన మాటలను గమనించడం, ఇతరులు చెప్పిన మాటలతో పోల్చి పరీక్షించి చూసుకుని అందులోని సారాన్ని గ్రహించడం, ఇదంతా కలసి మెరసి - "ధర్మం శరణం గచ్ఛామి".

మరి ఆయన చుట్టూ వున్న శిష్య పరిగణంతో ఇతర బుద్ధుళ్ళతో వాళ్ళను గమనిస్తూ వాళ్ళతో పాటు చేరి వాళ్ళతో పాటు వుండి వాళ్ళ దగ్గరనుండి అన్నీ నేర్చుకుంటూ వాళ్ళలో ఒకళ్ళుగా మెలగటమనేదే "సంఘం శరణం గచ్ఛామి". "సంఘం" అంటే "బుద్ధ సంఘం". "పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్" అంటే - బుద్ధుళ్ళ సంఘం.

గౌతమబుద్ధుడు ఎవరిని "బ్రాహ్మణుడు" అన్నాడు? "కేవలం ఒక బ్రాహ్మణి అయిన తల్లి గర్భంలో జన్మించిన వానిని నేను బ్రాహ్మణుడు అనను" అన్నాడాయన. "పూర్వ జన్మల జ్ఞానం కలవాడూ; జ్ఞాననేత్రంతో స్వర్గాన్నీ; నరకాన్నీ చూసేవాడూ, జన్మరాహిత్యం పొందిన వాడూ; అభిజ్ఞాన పరాయణుడూ, మునీ, కృతకృత్యుడూ అయిన వాడినే నేను 'బ్రాహ్మణుడు' అంటాను" అని అన్నాడు. ఈ విషయంలో విస్తారంగా 'దమ్మపదం' లో చెప్పి వున్నాడాయన.

"శుద్ధి', 'అశుద్ధి' అనేది ఎవరికి వారికి సంబంధించినదే. ఒకరు మరొకరిని శుద్ధి చేయలేరు" అని ఖచ్చితంగా చెప్పారాయన.

"సుద్ధి అసుద్ధి పచ్చత్తం. నాఞ్ఞా అఞ్ఞా విసోదయే"

కనుక, మై డియర్ ఫ్రెండ్స్! ఎవరిని వారే సోపు పెట్టి కడుక్కోవాలి. ఏమిటా "సోపు" అంటే, అదే "ఆనాపానసతి"! "శ్వాస మీద ధ్యాస"! ఆధ్యాత్మిక యాత్రలో వాస్తవానికి ఏ మంత్రమూ లేదు; ఏ తంత్రమూ లేదు; ఏ యంత్రమూ లేదు. అన్ని మంత్రాలనూ, అన్ని తంత్రాలనూ, అన్ని యంత్రాలనూ ఐదున్నర సంవత్సరాలు కాచి, వడపోసి, పరీక్షలు చేసి వాటి నన్నిటినీ విసర్జించాడాయన- ప్రపంచాన్ని వాటి నుంచి పరిరక్షించాడు. కేవలం ఒక్కటే, - "నీ చిన్నప్పటి స్థితిలోకి వెళ్ళిపో! నీయొక్క ప్రౌఢదశ లో వుంటూనే శైశవదశలోకి వెళ్ళిపో - Be a Child. 'శ్వాస మీద ధ్యాస వుంచు', సహజమైన సరళమైన సున్నితమైన శ్వాస మీద ధ్యాస వుంచు".

"ఆనాపానసతి" అనేది గౌతమబుద్ధుడు ప్రపంచానికి ఇచ్చిన ఎంత అత్యద్భుతమైన వరమో!

మరొకసారి చెప్పకుందాం!

'ఆన' అంటే 'ఉచ్ఛ్వాస';

'అపాన' అంటే 'నిశ్వాస';

'సతి' అంటే 'కూడుకుని' ఉండటం'.

మై డియర్ ఫ్రెండ్స్! బ్రహ్మ విహారాల అత్యద్భుతమైన కాన్సెప్ట్‌ను గౌతమబుద్ధుడు అందరికీ ఇచ్చాడు. మనిషి నాలుగు విధాలుగా ఇతరులతో ప్రవర్తించాలి. ఇతరులలో నాలుగు రకాల వాళ్ళు వుంటారు. ఒక్కొక్కరితో ఒక్కొక్క విధంగా వుండాలి. 'మైత్రి', 'కరుణ', 'ముదితం', 'ఉపేక్ష' అని చెప్పేసి, మన కన్నా ఆర్థికంగా వున్నత స్థాయిలో వున్నవారిపట్ల 'మైత్రి' మనకన్నా ఆర్థికంగా తక్కువ స్థాయిలో వున్నవారిపట్ల 'కరుణా' మనకన్నా ఆధ్యాత్మికంగా ఉన్నత స్థాయిలో వున్నవారిపట్ల 'ముదితమూ', మనకన్నా ఆధ్మాత్మికంగా తక్కువ స్థాయిలో వున్నవారిపట్ల ఉపేక్షా కలిగి వుండాలి.

'మైత్రి', 'కరుణా', 'ముదితం', 'ఉపేక్ష' అన్నవే బ్రహ్మ విహారాలు, ఒక 'బ్రహ్మజ్ఞాని', అంటే ఒక బుద్ధుడు, సమాజంలో చరించే పద్ధతిని తెలిపే సూత్రాలే ఇవి. ఏ లోకంలోనైనా, ఏ కాలంలో నైనా ఓ బుద్ధుడు, అంటే 'ఆత్మ జ్ఞాని' ఒకే రకంగా చరిస్తాడు. వారి శాస్త్రీయ వ్యవహార పద్ధతులే బ్రహ్మ విహారాలు.

మన కన్నా ఎంతో చక్కగా ఎన్నో ఇళ్ళూ, ఎన్నో బిల్డింగ్‌లూ, ఎన్నో కార్లు వున్నవారి పట్ల మైత్రీ భావం; మనకన్నా ఆర్థికంగా తక్కువగా వున్నవారిపట్ల 'కరుణ'. మనకన్నా ఆధ్మాత్మికంగా - ఇంకొకరికి బాగా అనుభవాలు వచ్చి వుంటాయి, వారికి దివ్యచక్షువు బాగా తెరుచుకుని వుంటుంది... వారిపట్ల సంతోషం, 'ముదితం' వుండాలి. మరి హింసా పద్ధతిలో జీవించే వారిపట్ల, అంటే, ఆధ్మాత్మికంగా నీచంగా, నికృష్టంగా జీవించే వారిపట్ల ఉపేక్ష వహించాలి; వారి పట్ల ద్వేషం వుండరాదు. అయితే, వారితో కలిసి వుండరాదు.

ఎవరితో కలిసి వుంటామో వారి గుణాలు మనకు వచ్చేస్తాయి. ఎవరితో కలిసి వుండకూడదో వారి పట్ల ఉపేక్ష. 'ఉపేక్ష' - అంటే దూరంగా వుండాలి. వారి దగ్గరకు ఎక్కువగా పోరాదు. అయితే, వారిని ద్వేషించరాదు. దగ్గరికిపోతే వారు వీరవుతారు మై డియర్ ఫ్రెండ్స్! కనుక, మనకన్నా ఆధ్యాత్మికంగా తక్కువ స్థాయిలో వున్నవారిపట్ల - వారు సాధన కోసం మన దగ్గరకు రావాల్సిందే. మై డియర్ ఫ్రెండ్స్! ఎంతోమంది పట్ల ఉపేక్ష వహించాలి. దీన్నే హిందూ ధర్మంలో "అంటరానితనం" గా చేశారు.

నిజానికి “అంటరానితనం” అంటే దూరంగా వుంచడం; అంటే, వారిని “భౌతికంగా దూరంగా వుంచడమూ”, “నన్ను ముట్టుకోకు” అని చెప్పడమూ” కాదు. శరీరపరంగా అంటరానివాళ్ళు అనుకున్నారే కానీ, వారు ఆధ్యాత్మిక పరంగా అంటరానివాళ్ళు అనే విషయాన్ని ఎవరూ అర్థం చేసుకోలేదు.

ఆధ్యాత్మిక పరంగా అంటరానివాళ్ళు కనుక వారితో ఎక్కువ మాట్లాడి ఫలితం లేదు అని చెప్పేసి ‘అంటరానితనం’ అక్కడినుండి మొదలైందన్నమాట. కానీ శరీరపరంగా అది వికృతం చెంది హిందూ ధర్మాన్నే సర్వనాశనం చేసేసింది.

“భౌతికంగా ఎవరినైనా ముట్టుకోవచ్చు. అదే ఆధ్యాత్మికంగా అయితే కొంత అనుభవాలు రాకపోతే ముట్టుకోలేం. ధ్యానపరంగా, ఆత్మ పరంగా వాడు అనుభవాలు పొందవలసిందే! మరికాస్త అనుభవాలు పెరగాల్సిందే! అప్పుడే వాడు ఈ స్థితికి వస్తాడు. కనుక, అలాంటివారిపట్ల ఉపేక్ష వహించాలి” అని చెప్పాడు గౌతమబుద్ధుడు.

“భౌతికంగా ఎవరినైనా ముట్టుకోవచ్చు, అదే ఆధ్యాత్మికంగా అయితే కొంత అనుభవాలు రాకపోతే ముట్టుకోలేం; ధ్యానపరంగా, ఆత్మపరంగా వాడు అనుభవాలు పొందవలసిందే! మరికాస్త అనుభవాలు పెరగాల్సిందే! అప్పుడే వాడు ఈ స్థితికి వస్తాడు, కనుక, అలాంటివారిపట్ల ఉపేక్ష వహించాలి” అని చెప్పాడు గౌతమబుద్ధుడు.

గౌతమ బుద్ధుడు ఇంకా ఎన్నో విషయాలు చెప్పాడు, మై డియర్ ఫ్రెండ్స్! ఆయన చెప్పిన విషయాల్లో అత్యంత ముఖ్యమైనవి “నాలుగు ఆర్య సత్యాలు’!

“దుఃఖం ఎల్లడెలా వున్నది” అనేదే మొదటి ఆర్య సత్యం.

ఈ “దుఃఖం మరి తృష్ణ వలన కలుగుతోంది” అనేదే రెండవ ఆర్య సత్యం.

“తృష్ణ అన్నది అవిద్య వలన వచ్చింది” అనేదే మూడవ ఆర్య సత్యం.

“అవిద్య అన్నది ‘విద్య’ అనే దాని వలన పోతుంది” అనేదే నాలుగవ ఆర్య సత్యం.

కనుక, ఈ యొక్క ‘విద్య’ ఏమిటంటే - అదే ‘అష్టాంగమార్గం’.

“అష్టాంగ మార్గం” అంటే, ఎనిమిది అంగాలు వున్న మార్గం.

ఆ ఎనిమిది అంగాలే........

| | | |
|---|---|---|
| సమ్మా దిట్టి | - | సరియైన దృక్పథాలు |
| సమ్మా సంకప్పో | - | సరియైన సంకల్పాలు |
| సమ్మా వాచా | - | సరియైన వాక్కు |
| సమ్మా కమ్మంతో | - | సరియైన కర్మ |
| సమ్మా జీవో | - | సరియైన జీవనోపాయం |
| సమ్మా వాయామో | - | సరియైన శ్రద్ధ |
| సమ్మా సతి | - | సరియైన ఏకాగ్రత |
| సమ్మా సమాధి | - | సరియైన ధ్యానం |

బుద్ధుని ఈ "అష్టాంగమార్గం" ప్రపంచాన్నంతా ఉర్రూతలు ఊపింది! ప్రపంచం అంతా వెలుగైంది! మై డియర్ ఫ్రెండ్స్! ఈ అష్టాంగ మార్గం గురించి మరొకసారి విపులంగా చెప్పకుందాం.

గౌతమ బుద్ధుడి దగ్గర కొన్ని విశేషాలు వున్నాయి. అవి చాలా మందికి తెలియదు- ఆయన చక్కగా ఫ్లూట్ వాయించేవాడు! ఆయన ఎంతో అద్భుతంగా ఫ్లూట్ వాయించేవాడు! ఆయన ఫ్లూట్ వాయిస్తుంటే అందరూ ఆయన చుట్టూ చేరి ధ్యానం చేసేవారు. ఈ పాయింట్ నాకు పర్సనల్‌గా తెలుసు కనుక చెప్పాను.

మైడియర్ ఫ్రెండ్స్, గౌతమబుద్ధుడు ఎప్పడూ కూడానూ సీరియస్ ఫేస్ పెట్టుకొని లేడు. చైనాలో 'లాఫింగ్ బుద్ధా' అని ఒకటి వుంది. అక్కడికి వెళితే, ఒక పెద్ద బొర్ర వేసుకుని, ఒక పెద్ద బొజ్జ వేసుకుని, ఎప్పడూ పకపకా నవ్వుతూ బుద్ధుడు వుంటాడు, బుద్ధుని యొక్క చరమ దిశ 'లాఫింగే' గానీ, 'సీరియస్' గా వుండడం' ఎప్పడూ కాదు. కానీ , అదేమిటో ఈ భారతదేశంలో సీరియస్ ఫేస్ వచ్చేసింది. ఎందుకంటే, సాధారణ మానవుడు తనకు నచ్చని విషయాల్ని శాస్త్రం నుంచీ, చరిత్రలోంచి తీసేస్తూంటాడు. తనకు నచ్చినవన్నీ శాస్త్రంలోనూ, చరిత్రలోనూ వ్రాసుకుంటాడు. కనుక, మై డియర్ ఫ్రెండ్స్, గౌతమ బుద్ధుడు ఎంచక్కా ఎప్పడూ చిరుమందహాసంతో వుండేవాడు. సంగీతం పాడుకుంటూ ఉండేవాడు. ఫ్లూట్ వాయిస్తూ వుండేవాడు.

మై డియర్ ఫ్రెండ్స్! గౌతమ బుద్ధుడు ఆరోజులలోనే "నేను మళ్ళీ రెండు వేల అయిదు వందల సంవత్సరాలు తరువాత వస్తాను" అని చెప్పాడు. ఆయన "మైత్రేయ బుద్ధుడిగా", అందరితో మైత్రి వుండే విధంగా, ఎవరి పట్లా ఉపేక్ష లేకుండా- "ఇక్కడ నేను 'ఉపేక్ష' అని చెప్పాను గానీ

అందరితోనూ మైత్రి ఉండే విధంగా, మళ్ళీ రెండు వేల ఐదు వందల సంవత్సరాల తరువాత వస్తున్నాను గదా?" అని చెప్పేసి ఆయన అన్నాడు.

పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మాస్టర్స్ అందరూ కూడానూ అక్కడ ఆ జన్మలో బుద్ధుడితో వున్నవాళ్ళే! అక్కడ వున్నవాళ్ళే తిరిగి అందరూ "పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మాస్టర్స్"గా అవతరించారు. రెండువేల ఐదు వందల సంవత్సరాల తరువాత , నాటి ఆ "బుద్ధ సంఘమే నేటి 'పిరిమడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంటు".

గౌతమబుద్ధుడు మళ్ళీ 'రజనీష్' శరీరంలో 'ఓషో'గా ప్రవేశించాడు. రజనీష్ తన పేరు మార్చుకుని 'ఓషో'గా పేరు పెట్టుకున్నప్పుడు ఉన్నది 'రజనీష్' కాదు - గౌతమబుద్దుడు! ఆయనే 'మైత్రేయ బుద్ధుడి'గా అవతరించి ఆ తరువాత వెళ్ళిపోయాడు.

థియోసాఫికల్ సొసైటీస్ వారు జిడ్డు కృష్ణమూర్తి గారి శరీరాన్ని మైత్రేయ బుద్దుని రాక కోసం ప్రిపేర్ చేసుకున్నారు. కానీ, జిడ్డు కృష్ణమూర్తి ఆఖరి క్షణంలో అందుకు ఒప్పకోలేదు. అక్కడ చేసిన ప్రయోగం ఫెయిల్ అయింది. అయితే రజనీష్ ఎంతో మహాత్ముడు కనుక, ఆయన ఒకానొక గత జన్మలో బుద్ధుడి సహచరుడు మహాకశ్యపుడు కనుక- రజనీష్ తన శరీరాన్ని గౌతమ బుద్ధుడికి ఇచ్చేసినప్పడు - ఆఖరి నాలుగు సంవత్సరాలుగా "మైత్రేయ బుద్ధుడి"గా వెలుగొందాడు.

ఆ యొక్క "మైత్రేయ బుద్ధ" యొక్క పరంపరే "పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్"; మై డియర్ ఫ్రెండ్స్! ఆల్ పిరమిడ్ మాస్టర్స్ ఆర్ గ్రాండ్ బుద్ధిస్ట్ మాస్టర్స్! ఆ యొక్క బుద్ధుడి దగ్గర సుశిక్షితులైన గొప్ప మాస్టర్లు. కనుకనే పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ ఇంత అద్భుతంగా విరాజిల్లుతుంది. భూమండలం అంతా విస్తరిస్తోంది. 2012 సంవత్సరానికల్లా భూమండలంలో ఇక బుద్ధుడు కాని వాడు ఎవడూ వుండదు; 'బ్రాహ్మణుడు' కాని వాడు ఎవడూ వుండడు; 'బ్రహ్మజ్ఞానం పొందనివాడు ఎవడూ వుండడు. మై డియర్ ఫ్రెండ్స్!

Thank You very much!

# ధ్యానం అంటే

ధ్యానం అంటే ప్రార్థన కాదు

ధ్యానం అంటే స్తోత్రం కాదు

ధ్యానం అంటే నామస్మరణ కాదు

ధ్యానం అంటే మంత్రజపం కాదు

ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస

# ధ్యానం వలన లాభాలు :

1) శారీరక ధారుఢ్యం

2) మానసిక ప్రశాంతి

3) బుద్ధి సునిశిత

4) ఆర్థిక సంక్షేమం

5) సుమిత్ర ప్రాప్తి

6) ఆధ్యాత్మిక విజ్ఞానం

# ముక్తి

ధ్యాన సాధన ద్వారానే దివ్యచక్షువు ఉత్తేజితమవుతుంది

ధ్యాన సాధన ద్వారా మనమే గురువులుగా మారుతాం

ధ్యాన సాధన ద్వారా మనమే దైవస్వరూపాలమని తెలుసుకుంటాం

*- బ్రహ్మర్షి పత్రీజీ*